సాక్షి అనంతపురం

శనివారం । 1 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



పోలీసుల వలయంలో తాడిపత్రి

కౌంటింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తాడిపత్రి పట్టణాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
43.7°/ 24.8°

జిల్లా అంతటా శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పండ్ల అలంకరణలో దర్శనమిచ్చిన నెట్టికంటుడు



గుంతకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి మహోత్సవాల్లో 4వ రోజు శుక్రవారం పండ్ల అలంకరణలో ఆంజనేయస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవలో మూలవిరాట్‌కు శత (108) కలశాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఆపిల్, అరటి, మామిడి, బత్తాయి, ద్రాక్ష, కళింగర పండ్లతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి మల్లెపూలతో లక్షార్చన నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లాకు వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షం పడే సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం విడుదల చేసిన ఒక బులెటిన్‌లో తెలిపారు. ఈ నెల ఐదో తేదీ వరకు చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షపాతం నమోదు కావొచ్చని పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా నిదియాదేవి



నిదియాదేవి

అనంతపురం సిటీ: సమగ్ర శిక్ష ఏపీసీగా జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సమగ్ర శిక్ష ఏపీసీగా పని చేసిన వరప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో డీఈఓ వరలక్ష్మిని నియమించాలని చూసినా ఆమె సుముఖత చూపలేదు. తన కున్న ఇబ్బందులను కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఆ తరువాత ఏడీ నాగరాజుకు ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలనుకున్నా.. ఆయన కూడా ముందుకు రాలేదు.

ఐఏఎస్ నిదియాదేవికి అవకాశం

విద్యా శాఖ చాలా కీలమైన శాఖ. ఇక్కడ ఉద్యోగ సంఘాలు కూడా దండిగానే ఉన్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు కూడా పెత్తనం చెలాయిస్తుంటాయి. ప్రతి చిన్న అంశాన్నీ భూతద్దంలో చూస్తారు. అనేక ఒత్తిళ్లు ఉంటాయి. వాటిని భరించడం అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. అందుకే ఏపీసీ బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. జెడ్పీ సీఈఓ నిదియా దేవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, అందరి అంచనాలను తలకిందులు చేశారు. ఐఏఎస్ శిక్షణ అనంతరం తొలిసారి నిదియాదేవి జెడ్పీ సీఈఓగా వచ్చారు. విధి నిర్వహణలో ఆమె ఎలా గుంటారో తన పని తనంతోనే నిరూపించారు. ఇప్పుడు సమగ్ర శిక్ష ఏపీసీగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టడంతో విద్యాశాఖ అధికారుల్లో గుబులు మొదలైంది.

బాలవికాస్ చిన్నారుల కళావైభవం



నృత్య ఆరాధన నాట్య ప్రదర్శనలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: బాలవికాస్ చిన్నారులు పౌరాణిక ఘట్టాలను నృత్య భంగిమలతో అద్భుతంగా ప్రదర్శించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడు భక్తులు శుక్రవారం సత్యసాయి సన్నిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 'నృత్య ఆరాధన' పేరుతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. శివతాండవం, శ్రీకృష్ణలీలలు వంటి ఘట్టాలను కళ్లకు కట్టారు. సాయంత్రం బాల సంగీత విద్వాంసుడు మాస్టర్ సూర్యనారాయణన్ సంగీత కచేరీ నిర్వహించారు.

కొంగొత్త ఆశలతో ఖరీఫ్

నేటి నుంచి ఖరీఫ్ సీజన్ ఆరంభం

- నాలుగు రోజుల్లో పలకరించనున్న నైరుతి రుతుపవనాలు
- 3.46 లక్షల హెక్టార్లలో పంటల సాగు అంచనా
- 40 శాతం రాయితీతో 76 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ
- అందుబాటులో 50 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు
- పెట్టుబడికి ఢోకా లేకుండా రైతులకు రూ.251 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ
- ఈ నెల 15 నుంచి జూలై ఆఖరు వరకు విత్తుకు అనుకూలం



పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు కీలకమైన వ్యవసాయ సీజన్ ఖరీఫ్-2024 శనివారం నుంచి కొంగొత్త ఆశలతో మొదలవుతోంది. ముందస్తుగా విస్తారంగా కురిసిన తొలకర్ల నడుమ రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు (8.66 లక్షల ఎకరాలు)గా గుర్తించారు. ప్రధాన పంట వేరుశనగ 1.98 లక్షల హెక్టార్లుగా లెక్క వేశారు. వేరుశనగ తర్వాత ప్రధాన పంటలుగా పత్తి 48,586 హెక్టార్లు, కంది 36,367 హెక్టార్లు, ఆముదం 16,340 హెక్టార్లు, మొక్కజొన్న 11,554 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేశారు. ఆ తర్వాత జొన్న 5,036 హెక్టార్లు, ఉలవ 4,191 హెక్టార్లు, ఇక నీటి వసతి కింద ప్రధానపంటగా వరి 18,299 హెక్టార్లు కాగా.. మిగతావి పండ్లతోటలు, కూరగాయల పంటలు. అలాగే మిరప, ఉల్లి, చెరకు తదితర పంటలు సాగులోకి రానున్నట్లు పేర్కొన్నారు. గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల 2.73 లక్షల హెక్టార్లకే పంటల సాగు పరిమితం కాగా.. అంతకు మునుపు ఖరీఫ్-2022లో 4.04 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి.

4.03 లక్షల మంది రైతులు

జిల్లాలో 4,03,454 మంది రైతులు ఉన్నారు. అందులో ఒక హెక్టారులోపున్న చిన్నకారు రైతులు 1,27,584 మంది, 1 నుంచి 2 హెక్టార్లలోపున్న సన్నకారు రైతులు 1,47,044 మంది ఉన్నారు. ఇక రెండు నుంచి నాలుగు హెక్టార్ల లోపున్న మధ్యస్థ రైతులు 1,03,793 మంది, 4 నుంచి 10 హెక్టార్ల వరకు ఉన్న ఓ మాదిరి రైతులు 22,952 మంది, 10 హెక్టార్లు, అంతకన్నా ఎక్కువ కలిగిన పెద్ద రైతులు 2,081 మంది ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

నైరుతి వర్షాలపై ఆశలు

ఖరీఫ్ మొదలు కాకమునుపే మే రెండో వారం నుంచి జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడ్డాయి. సాధారణం 36.7 మి.మీ కన్నా 270 శాతం అధికంగా అంటే 105 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో రైతులు పొలాలను దుక్కులు చేసుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే 40 శాతం రాయితీతో 76 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ, 30 శాతం రాయితీతో 2,500 క్వింటాళ్ల కందులు, పెసలు, మినుములు, 50 శాతం రాయితీతో రాగులు, కొర్రలు, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లతో పాటు ప్రైవేట్ రిటైల్ డీలర్ల వద్ద సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచింది. పెట్టుబడికి ఢోకా లేకుండా ఇటీవల రూ.251 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఖరీఫ్‌కు అత్యంత కీలకమైన నైరుతి రుతుపవనాలు ఈ నెల 4 లేదా 5న జిల్లాలో ప్రవేశించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. వేరుశనగతో పాటు ప్రధాన పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు సరైన సమయమని ఏఆర్‌ఎస్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవ రెడ్డి, డాక్టర్ సాదినేని మల్లీశ్వరి, డీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

ఖరీఫ్-2024లో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం అంచనా..

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
వేరుశనగ	1,97,884
వరి	18,229
కంది	36,367
పత్తి	48,586
ఆముదం	16,340
మొక్కజొన్న	11,554
జొన్న	5,036
సజ్జ	1,610
కొర్ర	2,001
ఉలవ	4,191
పెసర	1,006
పొద్దుతిరుగుడు	1,725

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే డబ్బు జమ
- దీర్ఘకాలిక జబ్బులున్న వారికి ఇంటి వద్దే అందజేత



పింఛన్‌దారుతో వేలిముద్ర తీసుకుంటున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం క్రైం: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ మాసానికి సంబంధించి జిల్లాలో 2,87,519 మంది పింఛన్‌దారులకు రూ.86.065 కోట్ల నగదు పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది. శనివారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నారు. పింఛన్ కోసం ఎవరూ సచివాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా పింఛన్‌దారుల ఆధార్ అనుసంధానమైన ఖాతాల్లోకి డబ్బు జమ చేయనున్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు, మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానమైన 1,96,443 మంది పింఛన్‌దారుల ఖాతాల్లోకి రూ.58.93 కోట్లు సచివాలయ సిబ్బంది జమచేయనున్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న 91,076 మందికి వారి ఇళ్ల వద్దకే వెళ్లి రూ.27.13 కోట్లు పంపిణీ చేయనున్నారు. పింఛన్ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి జమ చేస్తారు? ఎవరికి ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తారన్న వివరాలు ఆయా సచివాలయాల వద్ద నోటీసు బోర్డులో ప్రదర్శించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇంటి వద్ద పింఛన్ తీసుకునేందుకు వేలిముద్ర పడక పోయినా ముఖ కదలికలు (ఆర్‌బీఐఎస్)ద్వారా అందించేలా అనుమతించారు.

రైతులకు అందుబాటులో మేలైన విత్తనాలు

- రేకులకుంట ఏఆర్‌ఎస్‌లో సంప్రదించాలి
- వేరుశనగ, కంది, ఆముదం రకాలు సిద్ధం



టీసీజీఎస్-1694 రకం వేరుశనగ



పీఆర్‌జీ-176 రకం కంది



ఐసీహెచ్-66 రకం ఆముదం

అనంతపురం అగ్రికల్చర్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మేలైన విత్తన రకాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్‌ఎస్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. అధిక దిగుబడులనిచ్చే టీసీజీఎస్-1694 రకం విత్తన వేరుశనగ, ఐసీహెచ్-66, ఐసీహెచ్-5 రకాలకు చెందిన ఆముదం విత్తనాలు, అలాగే పీఆర్‌జీ-176 రకం విత్తన కంది అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. అవసరమైన రైతులు రేకులకుంట పరిశోధన స్థానాన్ని సంప్రదించాలని సూచించారు.

- ఇక ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు బాగా చివికిన పశువుల ఎరువు ఎకరాకు 4 నుంచి 5 టన్నులు వేసుకుని దుక్కి చేసుకోవాలన్నారు. లేదంటే గొర్రెలు, మేకల మందను పొలాల్లో కట్టించుకుని భూసారం పెంచుకోవాలని తెలిపారు. వేరుశనగలో అధిక దిగుబడులను ఇచ్చే కదిరి-లేపాక్షి, కదిరి-హరితాంధ్ర, టీసీజీఎస్-1694, కే-6, ధరణి తదితర వాటిని ఎంపిక చేసుకోవాలన్నారు. పత్తి సాగు చేసే రైతులు వీలైనంత వరకు 150 నుంచి 160 రోజుల పంటకాలం కలిగిన స్వల్పకాలిక విత్తన రకాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతంలోని రైతులందరూ వీలైనంత వరకు స్వల్ప వ్యవధిలో విత్తుకుంటే పురుగులు, తెగుళ్లను బాగా అరికట్టవచ్చన్నారు. ఇక ఆముదానికి సంబంధించి హరిత, కిరణ్, జ్వాల, ప్రగతి లాంటి సూటి రకాలు లేదంటే డీసీహెచ్-117, పీసీహెచ్-111, జీసీహెచ్-8, ఐసీహెచ్-66, ఐసీహెచ్-5 లాంటి హైబ్రీడ్ రకాలు అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. విత్తన వివరాలు, సలహాల కోసం డాక్టర్ బి.సహదేవ రెడ్డి (77990 81289), డాక్టర్ జి.నారాయణ స్వామి (62812 84235), డాక్టర్ పవన్ కుమార్‌రెడ్డి (99669 70300)లను సంప్రదించాలన్నారు.
- ప్రస్తుత పరిస్థితుల్లో దానిమ్మ చెట్లకు విశ్రాంతి ఇవ్వాలి. బ్యాక్టీరియా తెగులును అదుపు చేయడానికి ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని 20 రోజుల వ్యవధిలో రెండు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేసుకోవాలి. మార్చి, ఏప్రిల్‌లో నాటిన అరటి మొక్కలకు సిఫారసు చేసిన మోతాదులో ఎరువులు వేసుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితులు ఆవులు, గేదెల్లో గాలికుంటువ్యాధి, ఎంటారో టాక్సీమియా, పారుడురోగం వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున తప్పనిసరిగా టీకాలు వేయించాలి. పశుగ్రాస పంటలుగా నీటి వసతి కింద జొన్న, మొక్కజొన్న, సజ్జ, బొబ్బర్ల పంట సాగు చేసుకోవచ్చు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియలో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం అదనపు ఏఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ పాల్గొని సూచనలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వీస్ ఓట్లకు సంబంధించిన సర్వీసు (ఈటీపీబీ)ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రక్రియపై అదనపు ఏఆర్‌ఓ, ఇతర సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈటీపీబీల కౌంటింగ్‌లో ప్రీకౌంటింగ్, కౌంటింగ్, పోస్ట్ కౌంటింగ్ ప్రకియలు ఉంటాయన్నారు. వీవీ ప్యాట్ కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది ఉండాలన్నారు. అవసరమైతే పోస్టల్ బ్యాలెట్లను రీ-కౌంటింగ్ చేయాల్సిన సందర్భాలు వస్తాయన్నారు.

సామగ్రి సిద్ధంగా ఉంచాలి

కౌంటింగ్ హాల్‌లో అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. సెల్‌ఫోన్లను కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించబోరని, వాటిని క్లాక్‌రూమ్‌లో ఉంచేందుకు ఒక అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించాలన్నారు.

ఏడు టేబుళ్లకు ఒక రో ఆఫీసర్

కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఏడు టేబుళ్లకు ఒక రో-ఆఫీసర్‌ను నియమిస్తున్నామన్నారు. టేబుల్ అటెండర్లు కంట్రోల్ యూనిట్లను, 17సీ ఫారాలను సంబంధిత టేబుళ్లకు చేర్చేలా రో-ఆఫీసర్ పర్యవేక్షించాలన్నారు.

రౌండ్ వారీగా వివరాలు

కౌంటింగ్ ప్రారంభమైన తరువాత రౌండ్ వారీగా ఫలితాల వివరాలను పొందుపరచి ఆర్‌ఓకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో చిన్న పొరపాటు కూడా జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకోసం ఒక ఇన్‌చార్జ్ అధికారిని నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు

- సిబ్బందికి పూర్తిగా సహకరించాలి
- అభ్యర్థులు, ఏజెంట్లకు ఎస్పీ సూచన
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత



అనంతపురంలో కేంద్ర సాయుధ బలగాలతో నిర్వహించిన కవాతులో పాల్గొన్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. అనంతపురంలో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలతో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అభ్యర్థులు, ఏజెంట్లు సిబ్బందికి సహకరించి కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేలా కృషి చేయాలన్నారు. కౌంటింగ్ జరిగే జేఎన్‌టీయూ పరిసరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన మూడంచెల భద్రత కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక పార్టీలతో పెట్రోలింగ్ చేపట్టామన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరూ గుంపులుగా గుమిగూడి ఉండరాదన్నారు. '30 పోలీస్ యాక్ట్' అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద చుట్టూ 3 కిలోమీటర్ల పరిధిని 'రెడ్ జోన్'గా ప్రకటించామని, ఈ ఉత్తర్వులు ప్రకారం ఎవరూ డ్రోన్లు ఎగురవేయరాదని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద జరిగే దృశ్యాలను కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉంటారన్నారు.

రిటర్నింగ్ అధికారి అనుమతి ఉంటేనే..

ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తామని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసేలా ఆదేశాలిచ్చామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి ఏజెంట్లు మాత్రమే వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. సమీప కాలనీలు, గ్రామాలకు చెందిన వారు సహకరించి సూచించిన ట్రాఫిక్ డైవర్షన్ల ద్వారా గమ్యం చేరుకోవాలన్నారు.

జిల్లా అంతటా హై అలర్ట్

జూన్ నాలుగో తేదీన జిల్లా అంతటా హై అలర్ట్ ప్రకటించామని ఎస్పీ పేర్కొన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ జరిగే జిల్లా కేంద్రంతో పాటు మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని సమస్యాత్మక కాలనీలు, గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, ట్రబుల్‌మాంగర్స్, హిస్టరీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. బాణసంచా నిల్వ ఉంచడం, క్రయవిక్రయాలు చేయడం, కాల్చడం నిషేధమన్నారు. గెలుపోటములు సహజమని, ఓడిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడటం, హేళన చేయడం, రెచ్చగొట్టడం చేయరాదని అన్నారు. కౌంటింగ్ పరిసరాల్లో హోటళ్లు, దుకాణాలను మూసివేయాలని నోటీసులు జారీ చేశామన్నారు.

5,978 మంది బైండోవర్

సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న 5,978 మందిని బైండోవర్ చేయించామని ఎస్పీ తెలిపారు. ఎన్నికల రోజు అల్లర్లు, ఘర్షణలు అంతకు మునుపు వారిపై ఉన్న పాత కేసులను పరిగణనలోకి తీసుకుని 332 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామన్నారు. చట్ట వ్యతిరేక శక్తులను హెచ్చరిస్తూ, ప్రజలకు భరోసానిస్తూ సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో 216 ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందస్తు చర్యల్లో భాగంగా పాత కేసుల్లో నిందితుల ఇళ్లు, పరిసరాల్లో 105 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించామని తెలిపారు. ప్రజలు కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలని, ప్రశాంతంగా జీవించాలని 934 గ్రామాల్లో అవగాహన కల్పించామన్నారు.

1,621 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కౌంటింగ్ వేళ సత్ప్రవర్తనతో ప్రశాంతంగా మెలగాలని సూచిస్తూ 1,621 మంది రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, హిస్టరీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించామని ఎస్పీ వెల్లడించారు. తాడిపత్రి, రాప్తాడు అనంతపురం రూరల్, అనంతపురం సబ్ డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో అల్లర్లు, ఘర్షణలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా తాజా పరిస్థితులు తెలుసుకుని సమస్యలను తొలి దశలోనే తుంచివేయడానికి డ్రోన్ కెమెరాలతో నిఘా వేశామన్నారు.

లాడ్జీల్లో బసపై ఆంక్షలు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో అపరిచితులు, అనుమానితులు లాడ్జీల్లో బస చేయకుండా, పందేలు కాయకుండా తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ చెప్పారు. మద్యం తాగి గొడవలకు కారణమయ్యే అవకాశం ఉన్న హోటళ్లలో క్షుణ్ణంగా పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు.

- శుక్రవారం ఉదయం జేఎన్‌టీయూ పరిసరాల్లో భారీ ఎత్తున ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జేఎన్‌టీయూ చుట్టూ ఐదు కిలోమీటర్ల మేర కవాతు కొనసాగింది. సాయంత్రం టవర్‌క్లాక్ వద్ద కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, సీఐలు రెడ్డప్ప, ధరణికిశోర్, నారాయణరెడ్డి, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, మధు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆమిద్యాలకు చేరుకున్న ఉత్సవ మూర్తులు



ఊరేగింపుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను తీసుకెళుతున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఆమిద్యాల గ్రామానికి చేర్చారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనారసింహుడి ఉత్సవ మూర్తులను పల్లకీలో అధిష్ఠించి మేళాతాళలతో ఆమిద్యాలకు తరలించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి పాల్గొన్నారు.

తాడిపత్రి అల్లర్ల ఘటనలో 9 మంది అరెస్ట్

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి అల్లర్ల ఘటనకు సంబంధించి 9 మంది టీడీపీ వర్గీయులను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. గత నెల 13, 14 తేదీల్లో జరిగిన అల్లర్లకు సంబంధించి ఇరు వర్గాలకు చెందిన సుమారు 800 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకూ 120 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా శుక్రవారం టీడీపీకి చెందిన ముచ్చుకోట సుదర్శన్‌రెడ్డి, విజయభాస్కరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కృపాకర్, రోషన్, నవీన్‌కుమారెడ్డి, సుధీర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి ఉరవకొండ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

రైలు నుంచి కింద పడి ఏలూరు వాసికి గాయాలు

పెద్దపప్పూరు: ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు... ఏలూరుకు చెందిన షణ్ముక రైలులో ప్రయాణిస్తూ శుక్రవారం మధ్యాహ్నం జూటూరు రైల్వే స్టేషన్‌ను చేరుకున్నాడు. ఈ క్రమంలో ప్లాట్‌ఫాంపై రైలు ఆగుతున్న సమయంలో దిగేందుకు ప్రయత్నించిన ఆయన అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్న క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి షణ్ముకగా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గాయపడిన వ్యక్తి పూర్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని, ఆయన కోలుకున్న తర్వాత మరిన్ని వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

అగ్రి కోర్సులతో కచ్చితమైన ఉపాధి

- తక్కువ ఫీజులకే నాణ్యమైన వ్యవసాయ విద్యా కోర్సులు
- నేటి నుంచి అగ్రి పాలిటెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ



తరగతి గదులు



రెడ్డిపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

బుక్కరాయసముద్రం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు కూడా అంత సులువుగా లభ్యం కావడం లేదు. దీంతో ప్రతి ఒక్కరిలోనూ పదో తరగతి పరీక్షలు రాయగానే నెక్స్ట్ ఏమిటనే ప్రశ్న అందరిలోనూ వ్యక్తమవుతూ ఉంటుంది. అయితే పదో తరగతి ఉత్తీర్ణత కాగానే రెండేళ్ల కాల వ్యవధి ఉన్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేయగలిగితే కేవలం 19 ఏళ్ల వయసులోనే కొలువులు దక్కడం ఖాయమని నిపుణులు అంటున్నారు. ఈ క్రమంలోనే అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 1 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర తెలిపారు. జిల్లాలోని రెడ్డిపల్లి కృషివిజ్ఞాన కేంద్రంతో పాటు శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరలో ప్రభుత్వ యాజమాన్యంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అలాగే అనంతపురం, తాడిపత్రితో పాటు శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

విద్యార్హతలు ఇలా...

పదో తరగతి ఉత్తీర్ణత అయి 15 నుంచి 22 సంవత్సరాల్లోపు వయసున్న వారికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. www.angrau.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలకు అవకాశం కల్పిస్తారు. పూర్తి సమాచారానికి ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

సీట్ల కేటాయింపు ఫీజులు ఇలా..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్సీలకు 15 శాతం సీట్లు, ఎస్టీలకు 6 శాతం, బాలికలకు 33 శాతం, అంగ వైకల్యం కలిగిన వారికి 3 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశ అర్హత పొందిన వారు ఏడాదికి రూ.8,800 చెల్లించాలి. హాస్టల్‌లో వసతి పొందేందుకు రూ.11 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి అయిన తర్వాత డిపాజిట్ సొమ్మును వెనక్కు చెల్లిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వ నిర్దేశించిన మేరకు ఏడాదికి రూ.29 వేలు ఫీజు, హాస్టల్‌కు సంబంధించి నెలకు రూ.5,500 చెల్లించాల్సి ఉంటుంది.

బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ కోర్సులు

కోర్సు	కాల వ్యవధి
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్	3 ఏళ్లు
డిప్లొమా ఇన్ హోం సైన్స్	3 ఏళ్లు

చాలా మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు



మా కళాశాలలో చదివిన పిల్లలు చాలా మంది ఇప్పుడు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులకు మంచి భవిష్యత్తు ఉంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 1 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ వసుంధర, ప్రిన్సిపాల్, రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

లారీని అటకాయించి దోపిడీ

- డ్రైవర్, క్లీనర్‌ను చితకబాదిన దుండగులు
- పోలీసుల అదుపులో నిందితులు



ఘటనను వివరిస్తున్న డ్రైవర్ ఇషాక్, క్లీనర్ సునీల్

గుంతకల్లు: లారీ డ్రైవర్, క్లీనర్‌ను చితకబాది సెల్‌ఫోన్లను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని కనపర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన ఇషాక్, సునీల్ లారీ డ్రైవర్, క్లీనర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న ఓ ఫ్యాక్టరీ నుంచి స్లాగ్ (జిప్సం) లోడుతో జమ్మలమడుగు సమీపంలోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీకి గురువారం సాయంత్రం బయలుదేరారు. రాత్రి గుంతకల్లు మండలం నక్కనదొడ్డి సమీపంలో ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో (ఏపీ16ఎఫ్ఈ 6661) వాహనంలో వస్తున్న వారు ఓవర్‌టేక్ చేసి లారీకి అడ్డు పెట్టారు. దీంతో భయపడిన డ్రైవర్ ఇషాక్ వెంటనే లారీని తప్పించి ముందుకు పోనిచ్చాడు. అయినా దుండగులు లారీని వెంబడిస్తూ సైరన్ మోగించడంతో పోలీసులనుకుని వాహనాన్ని ఐటీసీ డిపో వద్ద రోడ్డు పక్కన ఆపారు. అదే సమయంలో బొలెరో నుంచి కిందకు దిగిన ముగ్గురు యువకులు లారీ డ్రైవర్, క్లీనర్‌ను దుర్భాషలాడుతూ కిందకు లాగి చితకబాదారు. అనంతరం గాలించి వారి వద్ద డబ్బు లేకపోవడంతో రెండు సెల్‌ఫోన్లు లాక్కొని ఉడాయించారు. లారీ డ్రైవర్, క్లీనర్ అరుపులకు అప్రమత్తమైన సమీపంలోని వారు అక్కడకు చేరుకుని విషయం తెలుసుకుని డయల్ 100కు సమాచారం ఇచ్చారు.

పోలీసుల అదుపులో ముగ్గురు

డయల్ 100 నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. కాగా, నక్కనదొడ్డి వద్ద దారిదోపిడీకి పాల్పడిన దుండగులు గుత్తి సమీపంలోని ఓ ధాబా వద్దకు చేరుకుని భోజనం కోసం వాహనాన్ని ఆపారు. అక్కడ కూడా గొడవకు దిగడంతో ధాబా యజమాని వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడ చేరుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారనలో గుంతకల్లు సమీపంలో దారి దోపిడీకి పాల్పడింది వారేనని నిర్ధారణ కావడంతో గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఐ సురేష్ గుత్తికి చేరుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన వారు గుత్తి ఆర్ఎస్ సమీపంలోని లచ్చానుపల్లికి చెందిన వారిగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు, వైఎస్సార్ జిల్లా జట్ల విజయం

అనంతపురం: సౌత్‌జోన్ అండర్–19 క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, వైఎస్సార్ జిల్లా జట్లు విజయం సాధించాయి. తొలి మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 48.2 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 48.5 ఓవర్లలో 205 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. నెల్లూరు, వైఎస్సార్ జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 40.5 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వైఎస్సార్ జిల్లా జట్టు 40 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది.

'పది' పరీక్షకు 2,078 మంది హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన గణితం పరీక్షకు 2,078 మంది విద్యార్థులు హాజరయ్యారు. 4,774 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,696 మంది గైర్హాజరయ్యారు.

మాతాశిశు మరణాలు నివారించండి

కళ్యాణదుర్గం: మాతాశిశు మరణాలు నివారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత ఆదేశించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట అర్బన్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యులతో ఆమె సమావేశమై మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పనితీరు మరింత మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం సబ్ డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్, ఏరియా ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్‌కుమార్, సబ్ డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు పోటీలు

అనంతపురము ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ రూపకల్పనపై పోటీలు నిర్వహించారు. స్థానిక సైన్స్ సెంటర్ వేదికగా జరిగిన వ్యాసరచనకు 95 మంది విద్యార్థులు, పోస్టర్ రూపకల్పనకు 55 మంది, వక్తృత్వ విభాగంలో 42 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అన్ని విభాగాల నుంచి 22 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. విజేతలకు ఈ నెల 5న జరిగే పర్యావరణ దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా ఇంజనీర్ పీవీ కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ, ఆనంద భాస్కరరెడ్డి, రాము, మేడా ప్రసాద్, వెంకట రంగయ్య, సూరిబాబు, సదాశివయ్య, సతీష్ బాబు పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామానికి చెందిన సందీప్ (30)కు భార్య ప్రియ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా సందీప్ కర్ణాటకలోని గౌరీబిదనూరులో ఉన్న బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి కారులో గౌరీబిదనూరు పట్టణంలోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ఘటనలో కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో చిక్కుకుని సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియగానే మల్లిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహిత ఆత్మహత్య

గుత్తి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తురకపల్లికి చెందిన మురళి భార్య లక్ష్మీదేవి (40) కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో పలు ఆస్పత్రుల్లో భర్త చికిత్స చేయించాడు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న భర్త గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

తప్పు జరిగితే చర్యలు తప్పవు



ఉరవకొండ నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తప్పులు జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని కౌంటింగ్ సిబ్బందికి జాయింట్ కలెక్టర్, ఉరవకొండ నియోజకవర్గ ఎన్నికల ఆర్ఓ కేతన్‌గార్గ్ సూచించారు. కౌంటింగ్ అంశంపై ఉరకొండ నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బందికి శుక్రవారం జేఎన్‌టీయూ ఏలోని అడ్మిన్ బ్లాక్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జేసీ మాట్లాడుతూ ఈటీబీఎస్ (సర్వీసు) ఓట్లను లెక్కింపు విధానాన్ని వివరించారు. నిర్దేశించిన సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. గుర్తింపు కార్డు తప్పక ధరించాలన్నారు. సెల్‌ఫోన్‌లను అనుమతించరన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ జరుగుతుందని, వీటి లెక్కింపునకు అదనపు రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. తర్వాత ఈటీబీఎస్ ఓట్ల స్కానింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి 18 టేబుళ్లు ఏర్పాటు చేశారన్నారు. ఓట్ల లెక్కింపు 15 రౌండ్లలో పూర్తవుతుందన్నారు. ఇక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 14 కౌంటింగ్ టేబుళ్లు ఉంటాయని, 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందన్నారు. అనంతరం కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడి ఓట్ల లెక్కింపులో వారి విధుల గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు వలయంలో తాడిపత్రి

తాడిపత్రి అర్బన్: కౌంటింగ్ సందర్భంగా తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించారు. ఎస్పీ గౌతమిశాలి రెండు రోజులుగా తాడిపత్రిలోనే ఉంటూ భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్ల ఘటనలో పోలీసు వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. దీంతో అప్పటి ఎస్పీతో పాటు తాడిపత్రి డీఎస్పీ, అర్బన్ సీఐలపై ఎన్నికల కమిషన్ వేటు వేసింది. కౌంటింగ్ తేదీ సమీపిస్తుండడంతో పోలింగ్ ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే భారీగా పోలీసు బలగాలు తాడిపత్రికి చేరుకున్నాయి. తాడిపత్రిలోకి ప్రవేశించే ప్రతి మార్గంతో పాటు పట్టణం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రధాన రహదారుల్లో చెక్‌పోస్టులు, ప్రధాన కూడళ్లలో పికెట్‌లు ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. వీరిలో ఆరుగురు డీఎస్పీలు, 4 ప్లటూన్ల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు, 7 సెక్షన్ల ఏపీఎస్పీ బలగాలు, 4 సెక్షన్ల ఏఆర్ పోలీసులతో పాటు 300 మంది సివిల్ పోలీసులు ఉన్నారు.

46 మందిపై రౌడీ షీట్ : ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 151 మందిపై పోలీసులు రౌడీ షీట్లను తెరిచిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం మరో 46 మందిపై పోలీసులు రౌడీ షీట్లను ఓపెన్ చేశారు. ఇందులో టీడీపీకి చెందిన 23 మంది, వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఉన్నారు. దీంతో ఈ సంఖ్య 197కు చేరింది. నెల రోజుల వ్యవధిలోనే ఇంత పెద్ద సంఖ్యలో రౌడీషీట్లను తెరవడం తాడిపత్రి చరిత్రలో ఇదే ప్రప్రథమం కావడం గమనార్హం.

క్లుప్తంగా

పూడికతీత పనులు వేగవంతం చేయండి



39వ డివిజన్‌లోని వడ్డే వారి కాలనీలో పర్యటించిన మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కాలువల్లో పూడిక తీత పనులు వేగవంతం చేయాలని మేయర్ వసీం నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 39వ డివిజన్‌లో మేయర్ వసీం పర్యటించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా పూడికతీత పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నగరంలో ఎక్కడా కాలువలు బ్లాక్ కాకుండా వర్షపు నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పూడికతీత పనుల్లో భాగంగా తీసిన పూడికను సకాలంలో తరలించాలన్నారు. అనంతరం మేయర్ స్థానికులతో మాట్లాడారు. చెత్తను నగరపాలక సంస్థ కార్మికులకు అందజేయాలన్నారు. కాలువల్లో చెత్తా చెదారాన్ని వేయకుండా సామాజిక స్పృహ పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుతో మెడికల్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం మెడికల్: రోగులకు మెరుగైన సేవందించడంలో వైద్య సిబ్బంది పాత్ర కీలకం. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సూచించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తామని తెలియజేశారు. ఉమ్మడి జిల్లా కన్వీనర్లు కోకిల చాముండేశ్వరి, ఎస్ఎండీ షఫీ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై స్పందించి తమకు సహకరించాలని సూపరింటెండెంట్‌కు విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్‌ను కలసిన వారిలో ఎంపీహెచ్ఈఓ యల్లప్ప, హెడ్ నర్సు లక్ష్మి, అసోసియేషన్ నాయకులు బక్తర్ అలీఖాన్, మహేంద్రబాబు, కే.సుదర్శన్ రెడ్డి, అలివేలమంగమ్మ, ఉమాదేవి, తిప్పేరుద్రమ్మ, రాఘవేంద్ర, రమేష్‌బాబు, కిరణ్‌కుమార్ ఉన్నారు.

వెంకటాచలపతి సేవలు అమూల్యం



వెంకటాచలపతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల అభివృద్ధి కార్యాలయ ఏఓ వెంకటాచలపతి సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం వెంకటాచలపతి ఉద్యోగ విరమణ పొందడంతో ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ధర్మవరం డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంఈఓ వెంకటస్వామి, పీఆర్ జేఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, హౌసింగ్ రామ్మూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెంకటాచలపతి ఎంత పని ఒత్తిడి ఉన్నా అందరితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లేవారన్నారు. అనంతరం వెంకటా చలపతి దంపతులను సన్మానించారు.

ఏఎస్ఐ జనార్దన్‌కు వీడ్కోలు



జనార్దన్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న జనార్దన్ ఉద్యోగ విరమణ పొందడంతో శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ విరమణ అనేది తప్పనిసరి అన్నారు. జనార్దన్ శేషజీవితం బాగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం జనార్దన్ దంపతులను సన్మానించారు.



ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన టవర్‌క్లాక్ బ్రిడ్జి రోడ్డు



సప్తగిరి సర్కిల్ రోడ్డులో జనసంచారం లేకపోవడంతో స్వేచ్ఛగా వెళ్తున్న పశువులు



టోపీలు పెట్టుకుని వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

● 'ఫ్రై' డే

నగరంలో ఎండల తీవ్రత మళ్లీ పెరిగింది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు వాతావరణం కొంతమేర చల్లబడింది. అయితే రెండు రోజులుగా భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. ఎండలతో పాటు వడగాలులకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని ప్రధాన రహదారులు జనం లేక బోసిపోయాయి. మహిళలు ఎండల బారిన పడకుండా స్కార్ఫ్‌లు, టోపీలు ధరించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:



ఎండ వేడిమి తాళలేక చున్నీలు కప్పుకుని వెళ్తున్న యువతులు

కౌంటింగ్ రోజు గొడవ పడొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

రాప్తాడురూరల్: ఎన్నికల్లో గెలుపోటములు సహజం. గెలిచిన వారు సంయమనం పాటించాలి. అనవసరంగా రెచ్చగొట్టి గొడవలు చేస్తే మాత్రం తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం అనంతపురం రూరల్, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్లలో ఆయా గ్రామాల్లోని ఇరు పార్టీల నాయకులు, గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. 144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉన్నందున ఈనెల 4న కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. విజయోత్సవ ర్యాలీలు, టపాసులు కాల్చడం వంటివి నిషేధించడం జరిగిందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం జిల్లా బహిష్కరణ, రౌడీషీట్లు, పీడీయాక్ట్ లాంటి కఠిన చర్యలు ఉంటాయనేది గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ఏ పార్టీ గెలిచినా గ్రామాల్లో సంబరాలు చేసుకోకూడదన్నారు. ఎవరి పని వాళ్లు చేసుకోవాలి తప్ప గొడవలకు ప్రేరేపించినట్లు తెలిస్తే మాత్రం సీరియస్‌గా పరిగణిస్తామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సినీనటుడు కృష్ణకు ఘన నివాళి

అనంతపురం కల్చరల్: సినీనటుడు కృష్ణ వ్యక్తిత్వం విలక్షణం. ఆయన స్ఫూర్తితో అభిమానులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని మాజీ మేయర్ రాగే పరుశురామ్ అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ బాలభవన్ ఎదురుగా హీరో కృష్ణ 82వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణసేన నాయకుడు కుళ్లాయప్ప ఆధ్వర్యంలో మాజీ మేయర్ రాగే పరుశురామ్ కేక్ కట్ చేశారు. వందలాది మందికి అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హీరోల అభిమానులు కేవలం సినిమాలు ఆడించడం అనేది కాకుండా కృష్ణ కుటుంబంలో ఆయనతో పాటూ హీరో మహేష్ గ్రామాలను దత్తత తీసుకోవడం హర్షణీయమన్నారు. సినిమా పరిశ్రమలో కృష్ణ సాహసవంతుడిగా అనేక ప్రయోగాలు చేసి తెలుగు సినిమా స్థాయిని పెంచారన్నారు. కార్యక్రమంలో కృష్ణసేన నాయకులు విజయకృష్ణ, రవిరాజ, ఆటోరఫీ, శేఖర్‌బాబు, శ్రీనివాస్, రఘు, వెంకటేష్, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే అంతకుముందు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం డాక్టర్ నిర్మల మురళీ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ మేయర్ రాగేపరుశురామ్

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

అనంతపురం కల్చరల్: తెలుగు సినిమాను వినూత్న బాట పట్టించిన నటుడు, దర్శకుడు, నిర్మాత సూపర్ స్టార్ కృష్ణ కళారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కృష్ణ అభిమాన సంఘం నాయకుడు ఆలుమూరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణ జయంతిని అభిమానులు వివిధ సేవా కార్యక్రమాలతో జరుపుకున్నారు. కమలానగర్‌లోని మహిళా వృద్ధాశ్రమంలో, భైరవనగర్‌లోని అనాథాశ్రమంలో బ్రెడ్లు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నూర్ మహమ్మద్, జూటూరు శ్రీనివాసులు, ఆలం షేక్షావలి, నాగరాజు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

అనంతపురం మెడికల్: పొగాకు సేవించడం ద్వారా కేన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి. పొగాకును మానేయాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2కే21 బ్యాచ్‌కు చెందిన మెడికోలు పొగాకు ఉత్పత్తులకు మీ పిల్లలను దూరంగా ఉంచండి అంటూ ప్రదర్శించిన లఘునాటిక అందరినీ ఆకట్టుకుంది. అందులో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన మెడికోలను అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ తెలుగు శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో ప్రాణాపాయ వ్యాధులు

పొగాకు ఉత్పత్తులతో ప్రాణాపాయ వ్యాధులైన సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్), గుండెకు సంబంధించి బ్లడ్ ప్రెషర్, హార్ట్ ఎటాక్, వంటి ప్రాణాపాయ జబ్బులు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. పొగాకు సేవించడం ద్వారా తలెత్తే దుష్పరిణామాలను హెచ్ఓడీ డాక్టర్ వైద్యనాథ్ విపులంగా తెలియజేశారు. పొగాకు వాడకం తగ్గించుకోవడానికి డీ అడిక్షన్ సెంటర్‌లో సంప్రదిస్తే.. తగు చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, మానసిక వైద్యులు డాక్టర్ శారద, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వరదరాజులు, డాక్టర్ శశాంక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

పొగాకుతో ఆరోగ్యానికి ముప్పు

అనంతపురం కార్పొరేషన్: పొగాకు సేవించడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పొగాకుతో మానవాళి ఆరోగ్యానికి ముప్పు అని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. పొగాకు వినియోగం వల్ల పర్యావరణానికి హాని కల్గుతుందన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి పొగాకు వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. అంతకుముందు ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవిశంకర్, ఓబులు, డెమో సిబ్బంది ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత

హెడ్‌నర్స్, ఎంఎన్‌ఓ సేవలు మరువలేనివి



ఉద్యోగ విరమణ చేసిన హెడ్‌నర్సులను సన్మానిస్తున్న ఆర్ఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్



ఎంఎన్‌ఓ నాగరాజు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి హెడ్‌నర్సులు డి.పుష్పలత, టి.వలియమ్మ, ఎంఎన్‌ఓ నాగరాజు సేవలు మరువలేనివని ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో హెడ్‌నర్సులు, ఎంఎన్‌ఓ ఉద్యోగ విరమణ కార్యక్రమాలు వేర్వేరుగా జరిగాయి. మొదటగా లెక్చరర్స్ గ్యాలరీలో హెడ్‌నర్సుల ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు వారందించిన సేవలను వెలకట్టలేనివన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌నర్సులు సైరాభాను, మరియమ్మ, ఆర్‌బీ పద్మ, స్టాఫ్‌నర్సులు లత, శ్రీదేవి, సుజాత, నారాయణ స్వామి, ఐసీఎన్‌లు శోభా, నీలిమ, ప్రసన్న, సిబ్బంది కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఆత్మకూరు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. ఎస్పీ గౌతమి శాలి ఆదేశాలతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ రోజు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. బాణాసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేదమని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు ప్రవరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మునీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం

● ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత

అనంతపురం క్రైం: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపంగా మారింది. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్టాండులో కనీస సౌకర్యాలు కల్పించ లేదు. ఎటు చూసినా దుర్గంధం, బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తున్న దృశ్యాలు మహిళా ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయి. క్రమ పద్ధతిలో ఆపాల్సిన బస్సులను సైతం ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన హోటళ్లలో వంట చేసేటప్పుడు వెలువడే పొగ బస్టాండ్‌ను చుట్టేస్తోంది. పరిశుభ్రత లేకపోవడంతో ఈగలు ముసరి, తినుబండరాలు, కుళ్లిన పదార్థాల వాసన వస్తోంది. హోటళ్ల వద్ద వందల వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇక ప్రయాణికులు అటువైపు అడుగు పెట్టాలంటే భయపడుతున్నారు. మరుగుదొడ్ల మెయింటెన్స్ విషయంలో ముందు నుంచి సరైన శుభ్రత పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంతో అత్యాధునిక పద్ధతుల్లో ఉండాల్సిన మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాదారులు రోజువారి చెత్తా చెదారాన్ని ఆర్టీసీ ప్రధాన ద్వారం వద్ద వేసి నిప్పు పెడుతున్నారు. దీంతో బస్టాండు ఆవరణమంతా పొగతో కమ్ముకుపోతోంది. ప్రయాణికులకు ఆర్టీసీ కనీసం స్వచ్ఛమైన తాగునీటిని కూడా అందించలేకపోతోంది. దీంతో ప్రయాణికులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్టాండులోని స్టాళ్లలో వ్యాపారులు ఇదే అదనుగా భావించి నకిలీ కంపెనీ వాటర్ బాటిళ్లు విక్రయిస్తున్నారు. బస్సుల పరిశుభ్రత మొదలు.. ప్రయాణికులు వేచి చూసే బస్టాండు వరకు ప్రతి చోట సమస్యలు తిష్టవేశాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్సుల పార్కింగ్‌తో పాటు ఆవరణలో మొక్కల సంరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో దుస్థితి ఇలా..

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం



మెడికల్ విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ వైద్య విద్యార్థి చదువుకునేందుకు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. నగరానికి చెందిన రైతు ప్రసన్న కుమారరెడ్డి తన కొడుకు వరుణ్‌కార్తిక్ రెడ్డిని కష్టపడి చదివించాడు. ఈ నేపథ్యంలో వరుణ్‌కార్తిక్ గతేడాది నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 7,071, స్టేట్ ర్యాంకు 281 సాధించి ఎంబీబీఎస్ సీటు సంపాదించాడు. అయితే పుస్తకాలు, మెస్ చార్జీలకు ఆర్థిక పరిస్థితి సహకరించక పోవడంతో ఇబ్బంది పడుతున్న వరుణ్ కుమార్‌రెడ్డిని ఆదుకునేందుకు అమ్మ సంస్థ ముందుకొచ్చింది. శుక్రవారం అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి వైద్య విద్యార్థికి రూ.75 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కోర్సు పూర్తయ్యే వరకూ మెస్ చార్జీలు కూడా అమ్మ సంస్థ భరిస్తుందని తెలిపారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థిని ఆదుకోవడంతో రమణారెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్‌లోని పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 38 మంది గర్భిణులకు డాక్టర్ ఉదయ్ వివిధ వైద్య పరీక్షలు చేశారు. పలువురికి రక్త పరీక్షలు కూడా చేశారు. అనంతరం గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్‌రెడ్డి, పీహెచ్ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు

అనంతపురం కల్చరల్: హనుమజ్జయంతికి ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. శనివారం సుందరకాండ పారాయణం, సహస్ర నాగవల్లి దళార్చన, వత్సల సమేత హనుమంత కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తులు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. వివిధ ఆలయాల్లో విశేష అభిషేకాలు, ఆకుపూజలు, హోమాలు, ఊరేగింపులు జరగనున్నాయి. హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో సామూహిక హనుమద్ వ్రతం జరిగింది. సాయంత్రం 1,008 మందితో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. శ్రీరామనామ భజనలు, సంకీర్తనలు మార్మోగాయి. సోములదొడ్డిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకాలు చేపట్టారు. కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి, హెచ్చెల్సీ కాలనీలోని వలీ స్వామి ఆశ్రమం, తపోవనంలోని శివశక్తి బాబా ఆలయం, ఇందిరా నగర్, మారుతీనగర్ తదితర చోట్ల హనుమజ్జయంతి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు హిందు ధర్మప్రచార పరిషత్తు వారి ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కాలనీలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి నిర్వహించనున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు వివరాలు తెలిపారు. ఆకుపూజలు, సుందరకాండ, చాలీసా పారాయణం ఉంటుందన్నారు.



హనుమద్ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

వరప్రసాద్ రావుకు సన్మానం

అనంతపురం ఎడ్యుకేషన్: డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అడిషన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జె.వరప్రసాద్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. శుక్రవారం నగరంలోని కృష్ణ కళామందిరంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో సన్మానసభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా రెవెన్యూ అధికారి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వరప్రసాద్ రావు సేవలను కొనియాడారు. రెవెన్యూ శాఖలో మంచి అనుభవం ఉన్న అధికారి అని కొనియాడారు. రెవెన్యూ అంశాలపై అపారమైన పట్టు ఉందన్నారు. శేషజీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. వరప్రసాద్ రావు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో అందరి సహకారంతో బాగా పని చేశానన్నారు. సమగ్రశిక్ష ఏపీసీగా అందరి సహకారంతో విద్యా పథకాల అమలులో జిల్లాను అగ్రగామిలో నిలబెట్టామన్నారు. కేజీబీవీలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాలు ఆశించిన స్థాయిలో వచ్చేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వరి, గోవిందరెడ్డి, షమా, గోపాల్‌కృష్ణ, చంద్రమోహన్ రెడ్డి, మాధవరెడ్డి, ఏఎస్ఓ రాంప్రసాద్‌రెడ్డి, గురుమునికృష్ణ, ఏపీఓ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



వరప్రసాద్‌రావు దంపతులను సన్మానిస్తున్న డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, తదితరులు

సంగీతంతో మానసిక ప్రశాంతత

అనంతపురం కల్చరల్: గత నెల రోజులుగా సందడిగా సాగిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. డేనియల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో నగరంలోని ఎవర్‌షైన్ గ్లోరి చర్చి వేదికగా అనిల్‌కుమార్ నేతృత్వంలో కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. పాస్టర్ వినోద్‌కుమార్, పాస్టర్ బెంజిమన్ జాన్సన్ మాట్లాడుతూ.. శ్రావ్యమైన సంగీతం వినడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. చిన్నారులు పియానో, గిటార్, రిథంపై ప్రతిభను చాటుకుని అందరినీ మెప్పించారు. చక్కటి స్వరాలతో మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ పీటర్, శిక్షకుడు సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం